ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శుక్రవారం 16 ఫిబ్రవరి 2024




మంగళసూత్రాలను భక్తులకు చూపుతున్న అర్చకులు

రగిలిన ఉద్యోగి

రెండో రోజూ కొనసాగిన ఏపీజేఏసీ ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్‌లో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ప్రభుత్వ వంచనపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు రగిలిపోయారు. మధ్యంతర భృతి, డీఏ చెల్లింపులో నిర్లక్ష్యానికి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని ధ్వజమెత్తారు. అన్ని మండల కేంద్రాల్లో రెండోరోజు గురువారం నిరసన తెలిపారు. ఏపీజేఏసీ నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఏపీజేఏసీ తూర్పు కృష్ణా సంఘం అధ్యక్షుడు ఉల్లి కృష్ణ ఆధ్వర్యంలో ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద, మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి వద్ద భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. చల్లపల్లి, అవనిగడ్డ, ఘంటసాల, మోపిదేవి మండలాల్లోని తమ కార్యాలయాల్లో నల్లబ్యాడ్జీలు . ధరించి విధులకు హాజరయ్యారు.

- మచిలీపట్నం

- 6లో..


కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

కల్యాణం.. కమనీయం..

మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. - మోపిదేవి

- 6లో..

బూడిద కాలుష్యంపై ఉద్యమిస్తాం

- గేట్ల ముందు వంటా వార్పు చేద్దాం
- భావితరాలపై తీవ్ర కాలుష్య ప్రభావం
- ప్రజారోగ్యం వారికి పట్టదు
- సీఎస్ఆర్ ఫండ్ రూ.18 కోట్లు విడుదల చేయాలి
- ఎన్టీటీపీఎస్ కాలుష్య నియంత్రణ పోరాట సమితి సమావేశంలో వక్తలు


- 6లో..



రైతుల సహనానికి ప్రభుత్వం పరీక్ష పెడుతోంది. ఆన్‌లైన్ పద్ధతిలో విక్రయించిన ధాన్యం బిల్లులు చెల్లించకుండా తీవ్ర జాప్యం చేస్తోంది. జనవరి 12వ తేదీ నుంచి ధాన్యం బకాయిలు పెండింగులో పెట్టింది. 1.30 లక్షల టన్నుల ధాన్యం బిల్లులు రూ.258 కోట్లు విడుదల చేయకుండా నిలిపివేసింది. వీటి బిల్లులు రైతుల ఖాతాల్లో ఎప్పటికి జమ అవుతాయో అధికారులకు కూడా తెలియని స్థితి నెలకొంది. దీంతో మిగిలిన ధాన్యాన్ని బస్తాకు వంద రూపాయల తక్కువగా ధర వచ్చినా రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించేస్తున్నారు.

- నెల రోజులైనా రైతుల ఖాతాలకు జమకాని బిల్లులు
- పెండింగు బకాయిలు రూ.258 కోట్లు
- ఎప్పటికి ఇస్తారో అధికారులకూ స్పష్టత కరువు
- ధర తగ్గినా బహిరంగ మార్కెట్లో అమ్మకానికి సిద్ధపడుతున్న రైతులు

ధాన్యం బిల్లులేవి?



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఈ ఏడాది జనవరిలో ఆన్‌లైన్ పద్ధతిలో కొనుగోలు చేసిన 1.30 లక్షల టన్నుల ధాన్యానికి బిల్లులు విడుదల చేయకుండా ప్రభుత్వం నిలిపివేసింది. డిసెంబరులో మరో 40వేల టన్నులకుపైగా ధాన్యాన్ని ఆఫ్‌లైన్ పద్ధతిలో కొనుగోలు చేసింది. ఈ ధాన్యం వివరాలను అధికారులు ఆన్‌లైన్ చేయకుండా జాప్యం చేస్తున్నారు. ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆన్‌లైన్‌లో నమోదుచేసి, ఎప్పటికి ధాన్యం బకాయిలు విడుదల చేస్తారో తెలియని స్థితి నెలకొంది.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 10.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాగా ఉంది. ప్రకృతి విపత్తు మూలంగా సుమారుగా 9.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలో ఇప్పటివరకు 4.59 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అధికారుల లెక్కల ప్రకారం మరో 3 లక్షల టన్నులకుపైగా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. నెలరోజులకుపైగా ధాన్యం బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది.

మద్దతు ధరలో కోత

ఆర్‌బీకేల ద్వారా ధాన్యం విక్రయిస్తే రైతులు అనేక ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఆర్‌బీకేలలో ధాన్యం నాణ్యతను పరిశీలించిన తరువాత మద్దతు ధరను నిర్ణయించి ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు నమోదుచేసి మిల్లులకు ధాన్యాన్ని పంపుతున్నారు. మిల్లర్లు ధాన్యంలో నూకశాతం అధికంగా ఉందని, రంగు మారిందని ఇతరత్రా కారణాలు చూపి మద్దతు ధర చెల్లింపులో బస్తాకు రూ.200 నుంచి రూ.250 వరకు కోత పెడుతున్నారు. రైతులను మిల్లుల వద్దకు పిలిపించి ధాన్యం మద్దతు ధరను తమ ఇష్టానుసారంగా నిర్ణయించి ఇంతకన్నా ధర ఇవ్వలేమని, నచ్చకుంటే ధాన్యం వెనక్కు తీసుకువెళ్లండని చెబుతున్నారు. మిల్లర్లు చెప్పిన ధరకు రైతులు ధాన్యం విక్రయించేంత వరకు లారీలు, ట్రాక్టర్ల నుంచి ధాన్యం దిగుమతి చేసుకోకుండా జాప్యం చేస్తున్నారు. 75 కిలోల బస్తాకు రూ.1637 మద్దతు ధరగా చెల్లించాల్సి ఉండగా రూ.1350కు మించి కొనుగోలు చేయడం లేదు. రైతుల నుంచి మద్దతు ధరకు అనుగుణంగా నగదు కట్టించుకుని ఇచ్చినట్టుగా రికార్డుల్లో చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరిస్థితి ఉండటంతో రైతులు ఆన్‌లైన్ పద్ధతిలో ధాన్యం విక్రయిచేందుకు సుముఖత చూపడం లేదు.

బహిరంగ మార్కెట్లో అమ్మకం

మండపేట, కడప, చిత్తూరు, హైదారాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు జిల్లాకు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం నాణ్యత, నూకశాతం పరిగణనలోకి తీసుకోకుండా, స్థానికంగా ఉన్న మధ్యవర్తుల ద్వారా బస్తా ధాన్యం రూ.1530 నుంచి రూ.1550 వరకు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. బస్తా ధాన్యాన్ని మద్దతు ధర రూ.1637 రావాల్సి ఉన్నా, రూ.1530కు రైతుల వద్ద కొంటున్నారు. ధర తగ్గినా వెంటనే డబ్బులు వస్తాయని రైతులు బహిరంగ మార్కెట్లో అమ్మేందుకు సుముఖత చూపుతున్నారు. ఉయ్యూరు, పామర్రు, గుడివాడ, గుడ్లవల్లేరు, మచిలీపట్నం, చల్లపల్లి తదితర ప్రాంతాల నుంచి పది రోజులుగా ధాన్యాన్ని ఇతర జిల్లాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేసి తీసుకుపోతున్నారు. ధాన్యం ధర విషయంలో స్థానిక మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడుతుండటం, ధాన్యం రవాణా ఖర్చులు రైతులే భరించాల్సి రావడం తదితర కారణాలతో రైతులు బహిరంగ మార్కెట్‌కే మొగ్గు చూపుతున్నారు. వారం రోజుల్లో నగదు ఇచ్చేలా ఒప్పందం చేసుకుంటున్నారు.



బీపీటీ-5204 రకం ధాన్యం అ'ధర'హో..

రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించే బీపీటీ-5204 రకం బస్తా ధాన్యం ప్రస్తుతం రూ.2వేల నుంచి రూ.2100గా పలుకుతోంది. ప్రభుత్వంతో పనిలేకుండా మండపేట, హైదరాబాద్‌కు చెందిన వ్యాపారులు టన్నులకొద్దీ ఈ రకం ధాన్యాన్ని అధిక ధర చెల్లించి కొంటున్నారు. వీటికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో వ్యాపారులు ఈ ధాన్యం కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు. బీపీటీ-5204 తోపాటు ఎంటీయూ 1061 ధాన్యాన్ని కూడా ఇతర జిల్లాలకు చెందిన వ్యాపారులు కొంటున్నారు.


టీటీడీ ఆధ్వర్యంలో అన్నదానం

కూపన్ ఉంటేనే ఆహారం

టీటీడీలో కొత్త విధానం

- కొద్దినెలల క్రితం అన్నదానం ప్రారంభం
- తొలుత పరిమితి లేకుండా భోజనం వడ్డింపు
- రద్దీ పెరగడంతో కూపన్ పద్ధతి
- మండిపడుతున్న భక్తులు

కొందరు భక్తులు దర్శనం పూర్తయిన తర్వాత భోజనానికి వెళ్తారు. మరికొందరు భోజనం చేసిన తర్వాత దర్శనానికి వెళ్తారు. తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలో నిత్యం కనిపించే దృశ్యం ఇది. తిరుమల తరహాలోనే టీటీడీకి అనుబంధంగా ఉన్న అన్ని దేవాలయాల్లో ప్రతి శనివారం అన్నప్రసాద వితరణ చేయాలని టీటీడీ అధికారులు నిర్ణయించారు. అయితే విజయవాడలోని దూరదర్శన్ ఎదురుగా ఉన్న వేంకటేశ్వరుడి ఆలయం వద్ద మాత్రం కూపన్ ఉన్న వారికి మాత్రమే అన్నదాన ప్రసాదం పంపిణీ చేయాలన్న విధానాన్ని తీసుకొచ్చారు. కూపన్‌లేని భక్తులను నిర్దాక్షిణ్యంగా వడ్డన వద్ద నుంచి పక్కకు లాగేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : టీటీడీకి సంబంధించిన వేంకటేశ్వరుడి ఆలయాలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయి. విజయవాడలో టీటీడీ కల్యాణ మండపం ప్రాంగణంలోనే ఈ ఆలయం ఉండగా, రాజధాని ప్రాంతం వెంకటాయపాలెంలో మరో ఆలయాన్ని టీటీడీ నిర్మించింది. టీటీడీలో నిత్యం ఏ విధంగా అన్నప్రసాద వితరణ జరుగుతుందో అదే విధంగా ప్రతి శనివారం టీటీడీకి అనుబంధంగా ఉన్న అన్ని ఆలయాల వద్ద ప్రసాద వితరణ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ జరిగే అన్నప్రసాద వితరణను దాతల సహకారంతో చేయాలని భావించారు. ఈ బాధ్యతలను స్థానికంగా ఉండే ఆలయ, కల్యాణ మండప మేనేజర్లకు అప్పగించారు.

కూపన్ లెక్క ఏమిటి?

టీటీడీ అధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత ఇక్కడ ఉన్న అధికారులు, సిబ్బంది దాతలను ఆహ్వానించారు. అన్నప్రసాద వితరణకు సహకరించాలని కోరారు. దీని ప్రకారం కొద్దినెలల క్రితం టీటీడీ కల్యాణ మండపం ఆవరణలోని వేంకటేశ్వరుడి ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఉదయం 11 గంటల నుంచి ఇక్కడ అన్నప్రసాద వితరణ ప్రతి శనివారం చేస్తున్నారు. ప్రతి శనివారం స్వామి వారికి 11 గంటల సమయంలో హారతి ఇస్తారు. ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత భక్తులకు అన్నదానం చేస్తున్నారు. అన్నదానం ప్రారంభించిన మొదట్లో భక్తులు స్వల్ప సంఖ్యలో వచ్చారు. ఇక్కడ ప్రతి శనివారం అన్నదానం చేస్తున్నట్టు బోర్డు ఏర్పాటు చేశాక భక్తుల సంఖ్య పెరిగింది. వంటకాలు ఉన్నంత వరకు వచ్చిన వారందరికి అన్నదానం చేసేవారు. దీనికి ఎలాంటి పరిమితి ఉండేది కాదు. ఇప్పుడు భక్తుల సంఖ్య పెరిగిపోవడంతో కూపన్ విధానాన్ని అమలు చేస్తున్నారు.

కూపన్ లేకపోతే లాగేయడమే..

హారతులు పూర్తయిన తర్వాత దర్శనానికి వెళ్లే భక్తులకు అన్నదాన కూపన్ ఇస్తున్నారు. ఈ కూపన్ తీసుకుని క్యూలో ఉన్న వారికి మాత్రమే భోజనాలు వడ్డిస్తున్నారు. చివరికి టీటీడీలో పనిచేస్తున్న ఉద్యోగులకు కూపన్ తప్పనిసరి చేశారు. కూపన్ లేకుండా క్యూలో ఉన్న వారిని వడ్డన వద్దకు వెళ్లే సరికి నిర్దాక్షిణ్యంగా పక్కకు లాగేస్తున్నారు. దీనిపై భక్తులు మండిపడుతున్నారు. భక్తులకు పంపిణీ చేసే అన్నప్రసాదంలో పరిమితులు విధించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై టీటీడీ అధికారులను వివరణ కోరగా ఈ అన్నదానాన్ని దాతలు చేస్తున్నారని, వారే ఈ విధానాన్ని ప్రవేశపెట్టారని చెబుతున్నారు.

గన్నవరంలో మళ్లీ మైనింగ్

సర్వే నెంబర్ 860లో 122 ఎకరాలు



ఎన్నికల నేపథ్యంలో ఎవరి పనుల్లో వారు హడావిడిగా ఉన్నారని.. తమను ఎవరూ పట్టించుకోరనే ధీమాతో మైనింగ్ మాఫియా రెచ్చిపోతోంది. గన్నవరం నియోజకవర్గంలో కొండలు, గుట్టలను గుల్ల చేస్తోంది. వెదురుపావులూరు కొండలో ఆగిన అక్రమ క్వారీయింగ్ మళ్లీ మొదలైంది. ఈసారి తవ్వుకునే శక్తులు మారాయంతే. రైల్వే నూతన లైన్లకు సంబంధించి పనుల కోసం భారీగా ఇక్కడి నుంచి గ్రావెల్‌ను తవ్వుకుపోతున్నారు. ఈ తవ్వకాలకు మైనింగ్ శాఖ నుంచి ఎలాంటి పర్మిషన్లు లేవు. రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవు. అన్ని అనుమతులున్నాయంటూ బుకాయిస్తూ గ్రావెల్‌ను తరలిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వెదురుపావులూరులోని కొండను ఇంతకు ముందు కృష్ణాజిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి బ్యాచ్ పిండిచేసిన సంగతి తెలిసిందే. అదే కొండలో సర్వే నెంబర్ 860లో పెద్దఎత్తున ఈ సారి కొత్తవాళ్లు రంగ ప్రవేశం చేసి కొండను తొలిచేస్తున్నారు. భారీ క్రేన్లను రప్పించి మరీ తవ్వేస్తున్నారు. రైల్వేలైన్ల పనుల కోసం గ్రావెల్ తరలిపోతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు సాగించటం ఒకఎత్తు అయితే.. అక్రమ తవ్వకం వల్ల మినరల్ ఫండ్‌ను కోల్పోవాల్సి వస్తోంది.

మైనింగ్, రెవెన్యూ అధికారులు విరుద్ధ వ్యాఖ్యలు

పురుషోత్తపట్నం, కొండపావులూరు గ్రామాల మీదుగా వందల సంఖ్యలో భారీ టిప్పర్లు తిరుగుతూ స్థానికులను భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి. విపరీతమైన దుమ్ము, ధూళి వంటివి వెదజల్లుతూ తీవ్ర కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. స్థానికులు లారీలను అడ్డగిస్తున్నా మైనింగ్ మాఫియా రెచ్చిపోతూనే ఉంది. స్థానికులు మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు చేస్తే తాము అనుమతులు ఇవ్వలేదని చెబుతున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే తమకు సంబంధం లేదని, మైనింగ్ అధికారులు అనుమతులు ఇచ్చారని చెబుతున్నారు. ఇలా రెండు శాఖల అధికారులు తమకు సంబంధం లేదంటూ తప్పించుకుంటున్నారు. ఈ వ్యవహారంలో అధికార యంత్రాంగానికి అక్రమార్కులు భారీగా ముడుపులు ముట్టచెప్పినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- అడ్డగోలుగా తవ్వి తరలిస్తున్న అక్రమార్కుడు
- ఒకరిపై మరొకరు చెప్పుకొని తప్పుకుంటున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు


వెదురుపావులూరు వద్ద జరుగుతున్న అక్రమ తవ్వకాలు

పోలవరం కాలువపైనా మైనింగ్

ఆగిపోయానుకున్న పోలవరం కాలువ మట్టి తవ్వకాలు కూడా మళ్లీ మొదలయ్యాయి. అధికార పార్టీ నాయకుడి ముఖ్య అనుచరుడి బంధువు పేరుతో ఒక వ్యక్తి గొల్లనపల్లి సమీపంలో భారీగా పోలవరం కాలువ మట్టిని తవ్వేస్తున్నాడు. స్థానికులు మట్టిని ఎందుకు తవ్వుతున్నావని ప్రశ్నించగా.. తాను ప్రజాప్రతినిధి బంధువునంటూ గ్రామస్తులపై హూంకరిస్తున్నాడు. దీంతో భయపడిపోయి గ్రామస్తులు తప్పుకోగా.. అక్రమార్కులు భారీగా పోలవరం కాలువ మట్టిని తరలించుకుపోతున్నారు. పోలవరం కాలువ వెంబడి మట్టిగట్టులను తరలించుకుపోవటం వల్ల భవిష్యత్తులో వరద ప్రవాహాన్ని అడ్డుకునే పరిస్థితి ఉండదు. అనుకోకుండా సంభవించే వరదల వల్ల గ్రామాల మీదకు నీరు పోటెత్తే అవకాశం ఉంటుంది. పొలాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఇరిగేషన్ శాఖ అనుమతులు ఇచ్చిందని చెబుతూ అధికార పార్టీ నేత ముఖ్య అనుచరుడి బంధువు ఎడాపెడా తవ్వేస్తున్నాడు. ఇరిగేషన్ అధికారులేమో తామెలాంటి అనుమతులూ ఇవ్వలేదని చెబుతున్నారు. బల్లిపర్రులో కూడా ఇదే పోలవరం కాలువ మట్టిని తవ్వుతున్నారు.

వైభవంగా సుబ్బారాయుడి రథోత్సవం


మోపిదేవిలో రథంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

మోపిదేవి, ఫిబ్రవరి 15: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి రథో త్సవం వైభవంగా జరిగింది. విద్యుత్ దీపాలు, పూల దండలతో విశేష అలంకరించిన రథంపై కల్యాణ మూర్తులైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఆశీనులను గావించారు. అర్చక బృందం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించగా, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, డీఎస్పీ మురళీధర్, ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధర రావులు కొబ్బరి కాయలు కొట్టి రథాన్ని లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. పలురకాల నృత్య ప్రదర్శనలు, విచిత్ర వేషధారణలు రథం ముందు ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. పురవీధుల్లో స్వామి రథంపై ఊరేగారు.


అవార్డులు అందుకున్న వలంటీర్లతో కలెక్టర్ ఢిల్లీరావు

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

వన్‌టౌన్, ఫిబ్రవరి 15: వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. గురువారం గుంటూరుజిల్లా ఫిరంగిపురంలో వలంటీర్లకు అభినందన కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించాక కలెక్టరేట్ సమావేశమందిరంలో ఎన్టీఆర్ జిల్లాలో 10,150 మందికి పురస్కారాలు అందజేశారు. 982 మందికి సేవా మిత్ర, 133 మందికి సేవా రత్న, 35 మందికి సేవా వజ్ర పురస్కారాలకు ఎంపికయ్యారు. సేవా వజ్ర పురస్కార గ్రహీతకు రూ.45 వేలు, సేవా రత్న పురస్కార గ్రహీతకు రూ.30వేలు, సేవా మిత్ర పురస్కార గ్రహీతకు రూ.15వేల నగదు బహుమతిని అందిస్తామని తెలిపారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కె.అనురాధ పాల్గొన్నారు.

పటమట సబ్ రిజిస్ట్రార్‌పై వేటు!

- గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ ఆకస్మిక తనిఖీల కేసులో చైతన్యను బాధ్యుడిని చేస్తూ సస్పెన్షన్
- అప్పట్లో జాయింట్ - 2 సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న చైతన్య
- ఏసీబీ తనిఖీల్లో కొంతమంది ప్రైవేట్ వ్యక్తుల దగ్గర డబ్బు గుర్తింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పటమట సబ్ రిజిస్ట్రార్ చైతన్యపై రిజిస్ట్రేషన్స్ శాఖ వేటు వేసింది. ప్రభుత్వం నుంచి రిజిస్ట్రేషన్స్ శాఖ ఐజీకి వచ్చిన ఆదేశాల మేరకు చైతన్యపై సస్పెన్షన్ విధిస్తూ శుక్రవారం విజయవాడ డీఐజీ రవీంద్రనాథ్ ఉత్తర్వులిచ్చారు. మూడేళ్ల కిందట రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ ఆకస్మిక తనిఖీలు చేసింది. గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీల సమయంలో కొంతమంది ఏజెంట్ల దగ్గర డబ్బులు ఉండటాన్ని గుర్తించి ఏసీబీ నగదును స్వాధీనం చేసుకుంది. ఆ సమయంలో విధి నిర్వహణలో జాయింట్-2 రిజిస్ట్రార్ చైతన్య ఉన్నారు. చైతన్య దగ్గర డబ్బులు కానీ, డాక్యుమెంట్స్ కానీ ఏసీబీ అధికారులు గుర్తించలేదు. ఏజెంట్ల దగ్గర డబ్బులున్న విషయాన్ని ఏసీబీ ప్రభుత్వానికి రిపోర్టు చేసింది. తర్వాత చైతన్యను ఐజీ ఆఫీసుకు బదిలీ చేశారు. మూడేళ్లపాటు నాన్ ఫోకల్ పోస్టులో ఉన్న చైతన్య గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఫోకల్ స్థానంలో చేరారు. గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో పనిచేసిన కాలంలో దొంగ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న రాకెట్‌ను పట్టుకున్నారు. గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అది అప్పట్లో సంచలనంగా మారింది. పటమట సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న రాఘవరావుపై ఏసీబీ దాడుల నేపథ్యంలో, ఖాళీగా ఉన్న స్థానాన్ని ఐజీ కార్యాలయం చైతన్యతో భర్తీ చేసింది. అనూహ్యంగా అప్పటి కేసుకు సంబంధించి చైతన్యను బాధ్యుడిని చేస్తూ చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం నుంచి ఐజీ కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయి. ఐజీ ఆదేశాలతో చైతన్యపై సస్పెన్షన్ విధిస్తూ విజయవాడ డీఐజీ ఆదేశాలు ఇచ్చారు. అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా ఏసీబీ ఆకస్మిక తనిఖీల్లో భాగంగా నమోదు చేసిన కేసులకు సంబంధించి ఏ సబ్ రిజిస్ట్రార్లనూ బాధ్యులను చేయకుండా పటమట సబ్ రిజిస్ట్రార్‌ను మాత్రమే బాధ్యుడిని చేసి సస్పెన్షన్ విధించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సీనియర్ అసిస్టెంట్‌గా కొనసాగుతున్న నవాబుకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారని తెలుస్తోంది.

డ్వాక్రా మహిళల్లో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందిస్తాం

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ బి.రాజశేఖర్

మచిలీపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల సభ్యులు, వారు చేస్తున్న వృత్తుల్లో మరింత నైపుణ్యాన్ని పెంచుకునేందుకు వారికి సాంకేతిక పరమైన అంశాల్లో శిక్షణ ఇస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల కమిషనర్ బి.రాజశేఖర్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో రూ.5కోట్లతో నిర్మించనున్న శిక్షణ, సాంకేతిక అభివృద్ధి కేంద్రం(టీటీడీసీ)భవన నిర్మాణానికి కలెక్టర్ పి.రాజాబాబుతో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. కలెక్టరేట్‌లో డ్వాక్రా మహిళలకు శిక్షణ కార్యక్రమాలు, అధికారిక సమావేశాలు, అవగాహనా కార్యక్రమాల నిర్వహణకు డీఆర్‌డీఏలో అందుబాటులో ఉన్న నిధులు, తనవద్ద ఉన్న నిధులు రూ.5 కోట్లతో టీటీడీసీ భవనాన్ని నిర్మించాలని నిర్ణయించామని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు తోట మునెమ్మ, డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయకుమారి, డీపీవో నాగేశ్వరనాయక్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఉరికే ఉత్సాహంతో..

- గుడ్లవల్లేరులో 10కే, 5కే రన్


5కే రన్‌లో పాల్గొన్న మహిళలు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 15: శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల (ఎస్ఆర్‌జీఈసీ) రజతోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం నిర్వహించిన 10కే (పురుషులు), 5కే (మహిళలు) రన్‌లలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 19 జిల్లాల నుంచి 600 మంది పాల్గొన్నారని, 8 ఏళ్ల నుంచి 75 ఏళ్ల వారి వరకు వారిలో ఉన్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ తెలిపారు. విజేతలందరికీ కలిపి రూ1.17 లక్షల నగదు బహుమతి, రజతోత్సవ పతకాలను గుడివాడ రూరల్ సీఐ కె.ఏసుబాబు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ ఝాన్సీరాణి అందజేశారు. కళాశాల కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణరావు, సహకార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, గవర్నింగ్ బాడీ సభ్యులు వల్లూరుపల్లి వెంకటకిరణ్, మునునూరి శ్రీరామ్, యాజమాన్య సలహాదారు పొట్లూరి రవీంద్రబాబు పాల్గొన్నారు. 10కే రన్‌లో విజయవాడకు చెందిన కె.రెడ్డప్ప, విజయనగరానికి చెందిన ఎం.హరీష్, విజయవాడకు చెందిన టి.బ్రహ్మారెడ్డి, విశాఖపట్నానికి చెందిన ఎం.సత్యం, కడపకు చెందిన కె.నవరాజ్, 5కేలో విశాఖపట్నానికి చెందిన ఎల్.మేరీగ్రేస్, బి.కరుణ, గుడివా డకు చెందిన పి.చక్ర అనూష, భీమవరానికి చెందిన బి.అర్చన, గొడవర్రుకు చెందిన పి.మేరీజ్యోత్స్నలు మొదటి ఐదుస్థానాల్లో నిలిచారు.

ముగింపు వేడుకలకు గవర్నర్ రాక

ఎస్ఆర్‌జీఈసీ కళాశాలలో ఈనెల 16, 17, 18 తేదీల్లో రజతోత్సవ వేడుకలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ తెలిపారు. 16న ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ది ఏరోనాటికల్ సొసైటీ ఫర్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి, విశిష్ట అతిథిగా ఐటీ దిగ్గజం త్రిపురనేని హనుమాన్ చౌదరి, 17న అలూమినీ డే సందర్భంగా పురస్కార ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, గౌరవ అతిథిగా జేఎన్టీయూకే ఉపకులపతి జీవీ ప్రసాదరాజు పాల్గొంటారని తెలిపారు. 18న వేడుకల ముగింపు కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవుతారని తెలిపారు.




నల్లబ్యాడ్జీలతో కానూరు హైస్కూల్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు, విజయవాడ జీజీహెచ్, మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో వైద్య సిబ్బంది

ఉద్యోగుల బకాయిలపై

బహిరంగ నివేదిక ఇవ్వాలి

- ఉద్యోగ సంఘాల లెక్కప్రకారం బకాయిలు రూ.25,500 కోట్లు
- ప్రభుత్వ లెక్క ప్రకారం రూ.20,500 కోట్లు
- ఈ భారీ వ్యత్యాసంపై ఆందోళనలో ఉద్యోగులు
- బహిరంగ నివేదిక ఇస్తే అపోహలు తొలగుతాయి
- ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ ఎ.విద్యాసాగర్ డిమాండ్


తిరువూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉద్యోగులు, ప్రభుత్వానికి మధ్య అపోహలు తలెత్తకుండా ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావాల్సిన బకాయిల మొత్తాన్ని బహిరంగ నివేదిక ద్వారా వెల్లడించాలని ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ ఎ.విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఏపీజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యమ శంఖారావం రెండో రోజున గురువారం నగరంలోని పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయ ప్రాంగణంలో ఉద్యోగులు నిర్వహించిన ఆందోళనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాల లెక్క ప్రకారం ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు రూ.25,500 కోట్లు అని, ఇటీవల మంత్రి వర్గ ఉపసంఘం సమావేశంలో కూడా దీనిని తెలియజేశారని తెలిపారు. అయితే ప్రభుత్వం మాత్రం రూ.20,500 కోట్ల బకాయి ఉన్నామని పేర్కొందని తెలిపారు. దీంతో ఉద్యోగుల్లో కొత్త ఆందోళన మొదలైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉద్యోగులు కొత్తగా ఏమీ కోరటం లేదని, తమ జీతాల నుంచి వివిధ రూపాల్లో మినహాయించిన, ఉద్యోగులు దాచుకున్న డబ్బులను మాత్రమే చెల్లించాలని కోరుతున్నారని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తెగేదాక లాగకుండా నిర్దీత సమయంలో పరిష్కరించగలిగితే గౌరవప్రదంగా ఉంటుందన్నారు. ఈనెల 27 వరకు వివిధ రూపాల్లో తమ ఆందోళన నిర్వహిస్తామన్నారు. పన్నెండో పీఆర్సీ కమిషనర్‌ను నియమించినా ఎలాంటి పురోగతి లేదన్నారు. కమిషనర్ పని చేయడానికి కార్యాలయం, సిబ్బందిని ఇవ్వలేదన్నారు. జిల్లాలు పర్యటించడంతో పాటు, ఉద్యోగ సంఘాల నుంచి అభిప్రాయాలను తెలుసుకోవటం చేయాలని, వీటన్నింటినీ సేకరించాక అధ్యయనం చేయటానికి మరికొంత సమయం పడుతుందని తెలిపారు. అధ్యయనం పూర్తయ్యి నివేదిక ఇవ్వటానికి చాలా సమయం పడుతుందని తెలిపారు. జూలై 1, 2023 నుంచి 12వ పీఆర్సీ అమలు చేయాల్సి ఉందన్నారు. నేటి వరకు పూర్తిస్థాయిలో పీఆర్సీ కమిషనర్ తన కార్యాచరణను ప్రకటించలేదన్నారు. తమ శాఖలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశంలో జాప్యం చేయకుండా సత్వరమే న్యాయం చేయాలని ఐటీఏ, డీఎల్‌టీ ఉద్యోగుల సంఘం ప్రతినిధి కృష్ణకిశోర్ డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం ప్రతినిధి ఎండీ ఇక్బాల్, రాష్ట్ర జేఏసీ కార్యనిర్వాహక కార్యదర్శి కె.జగదీష్, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల సంఘం ప్రతినిధి ఒ.సాయిరాం, ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల సంఘం నాయకులు మంగేశ్వరరావు, రవాణా శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.రాజబాబు, పంచాయతీ రాజ్ డిప్లమో ఇంజనీర్ల సంఘం ప్రతినిధి కె.రవీంద్రబాబుతో పాటు జేఏసీలో ఉన్న వివిధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు ఆందోళనలో పాల్గొన్నారు.

తీసుకోని డీఏలకు ఆదాయ పన్ను కడుతున్నాం..ఇదెక్కడి చోద్యం: ఏపీ జేఏసీ తూర్పు కృష్ణా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ

మచిలీపట్నం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, మధ్యంతర భృతిని విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, 2018నుంచి 2022 వరకు చెల్లించాల్సిన డీఏ బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించాలని ఉల్లి కృష్ణ డిమాండ్ చేశారు. ఉద్యోగులు తీసుకోని డీఏలకు ఆదాయపు పన్నును చెల్లించాల్సి వస్తోందని ఇదెక్కడి చోద్యమని ఆయన ప్రశ్నించారు. ఉద్యోగులకు 12వ పీఆర్సీని ఇంతవరకు చెల్లించలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారంలోపే సీపీఎస్‌ను రద్దు చేస్తామని చెప్పినా, ఇంతవరకు చేయలేదన్నారు. పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయకుండా జీపీఎస్‌ను అమలులోకి తెచ్చి ఉద్యోగులను గందరగోళానికి గురి చేస్తున్నారని అన్నారు. సీనియర్ పెన్షనర్లకు అదనపు పింఛనులోనూ ప్రభుత్వం కోత పెట్టిందన్నారు.

రెండో రోజూ కొనసాగిన నిరసన

మచిలీపట్నం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఏపీ జేఏసీ నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కలెక్టరేట్ వద్ద, మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి వద్ద ఉద్యోగులు భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఏపీ జేఏసీ తూర్పు కృష్ణాసంఘం అధ్యక్షుడు ఉల్లి కృష్ణ, వివిధ విభాగాల ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చల్లపల్లి, అవనిగడ్డ, ఘంటసాల, మోపిదేవి మండలాల్లో ఉద్యోగులు తమ కార్యాలయాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పెనమలూరు మండలం కానూరు జడ్పీ ఉన్నతపాఠశాలలో అమరావతి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రెడ్డమ్మ ఆధ్వర్యంలో టీచర్లు తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు.

డొక్కు బస్సులతో నరకం చూస్తున్నారు

- ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు రామకృష్ణ

తమ శాఖలో మూడు వేల బస్సుల కొరత ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఇప్పటికీ కాలం చెల్లిన బస్సులే నడుపుతోందని ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. డొక్కు బస్సులు, కాలం తీరిన బస్సుల కారణంగా ఆర్టీసీ ఉద్యోగులు నరకం చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం ఇప్పటికీ చెల్లించలేదన్నారు.

ఆస్పత్రులకు వాటా చెల్లించని ప్రభుత్వం

- పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధి జి.నారాయణరావు

పదవీ విరమణ చెందిన ఉద్యోగులను ప్రభుత్వం గుర్తించడం లేదని, పదవీ విరమణ తర్వాత సాధరణంగా వచ్చే అనారోగ్య సమస్యలకు వైద్య సదుపాయం లభించటం లేదని పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధి జి.నారాయణరావు తెలిపారు. ప్రభుత్వం ఆస్పత్రులకు చెల్లించాల్సిన తన వాటా చెల్లించకపోగా ఉద్యోగుల నుంచి మినహాయించుకున్న సొమ్మును ప్రభుత్వం తన దగ్గరే ఉంచుకోవడటం బాధాకరమని ఆయన అన్నారు.

నీటి సత్యాగ్రహ పాదయాత్ర

విజయవంతం

- కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు కృష్ణా జలాల కోసం టీడీపీ-గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాదయాత్ర
- దిగివచ్చిన ప్రభుత్వం.. నీటి సరఫరాకు ఏర్పాట్లు
- టీడీపీ అధికారంలోకి వస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం: కొలికపూడి శ్రీనివాస్



కొలికపూడి శ్రీనివాస్ నేతృత్వంలో ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు, నేతలు, ఇన్‌సెట్‌లో వృద్ధురాలు

ఎ.కొండూరు, ఫిబ్రవరి 15: మండలంలోని కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు కృష్ణా జలాలు సరఫరా చేయాలని టీడీపీ-గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నీటి సత్యాగ్రహ పాదయాత్ర విజయవంతమైంది. గురువారం ఉదయం టీడీపీ నేత, అమరావతి పరిరక్షణ సమితి కన్వీనర్ కొలికపూడి శ్రీనివాసరావు, గిరిజన సంఘం నేతలు భీమానాయక్, పీక్లానాయక్ ఆధ్వర్యంలో ఎ.కొండూరు అడ్డరోడ్డు నుంచి గిరిజన మహిళలు, టీడీపీ నేతలు ఖాళీ బిందెలతో పాదయాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర ఐదు కిలోమీటర్లు మేర సాగింది.

నీరు సక్రమంగా సరఫరా చేయకపోతే కలెక్టరేట్, సీఎం కార్యాలయాలు ముట్టడిస్తాం : కొలికపూడి

మూడు రోజుల క్రితం కృష్ణా జలాలు సరఫరా నిలిచిపోవడంతో సమస్య తెలుసుకున్న కొలికపూడి గిరిజన తండాలో పర్యటించారు. ప్రభుత్వం ఈ 14 లోపు కృష్ణా జలాలు సరఫరా చేయకపోతే 15న కిడ్నీ వ్యాధిగ్రస్తులు, గిరిజనుల కోసం నీటి సత్యాగ్రహ పాదయాత్ర చేస్తామని ఆయన ప్రకటించారు. ప్రకటించినట్టే గురువారం యాత్రను ప్రారంభించారు. దీప్లానగర్ తండాకు పాదయాత్ర రాగానే రెండు ట్యాంకర్లు తెచ్చి, నీటి సరఫరా చేస్తున్నట్టు నేతలకు అధికారులు, పోలీసులు తెలిపారు. దీంతో కొలికపూడి యాత్రను నిలిపివేశారు. కిడ్నీ ప్రభావిత గ్రామాలకు నీటిని సక్రమంగా సరఫరా చేయకపోయినా, ఒక్క రోజు నీరు రాకపోయినా కలెక్టరేట్, సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ ప్రాంతంలో తీవ్రమైన కిడ్నీ వ్యాధులతో ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారని, అయినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కొలికపూడి ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతి ఇంటికీ తాగునీరు, రూ.49 కోట్లతో కృష్ణా జలాలు అందజేస్తామన్న హామీ తాడేపల్లి గడప దాటలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మండలంలోని కిడ్నీ, తాగు, సాగునీటి సమస్యలకు శ్వాశత పరిష్కారం దొరుకుతుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, అలవాల రమేష్‌రెడ్డి, అబ్బు, గిరిజన నేతలు భీమానాయక్, పీక్లా నాయక్, గోపిరాజు, డేవిడ్‌రాజ్, మునియ్య, శంకర్, ప్రసాదరెడ్డి, చంద్రం, కిషోర్ పాల్గొన్నారు.

పేటలో భారీగా తెలంగాణ మద్యం స్వాధీనం

- ఇద్దరు అరెస్టు..రూ.62 వేల విలువైన 613 మద్యం బాటిళ్లు, ఆటో స్వాధీనం
- నిందితుల్లో ఒకరు విప్ సామినేని ఉదయభాను పూర్వ వ్యక్తిగత ఫొటోగ్రాఫర్, వైసీపీ కార్యకర్త

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 15: పట్టణంలో పట్టపగలు ఆటోలో అనధికారికంగా తెలంగాణ మద్యం తరలిస్తూ ఇద్దరు జగ్గయ్యపేట పోలీసులకు చిక్కారు. నిందితుల్లో ఒకరు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను మాజీ వ్యక్తిగత ఫొటోగ్రాఫర్, వైసీపీ కార్యకర్త కాగా.. మరొకరు తెలంగాణకు చెందిన వ్యక్తి. బుధవారం బలుసుపాడు రోడ్డు జంక్షన్‌లో తనిఖీలు చేస్తుండగా ఓ ఆటోలో రూ.62 వేల విలువైన 613 బాటిళ్ల మద్యం దొరికిందని ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం రెడ్లకుంటకు చెందిన పోలంపల్లి రామకృష్ణ, జగ్గయ్యపేట మండలం బలుసుపాడు గ్రామానికి చెందిన అమ్మనబోయిన గోపాలకృష్ణ అలియాస్ గోపి మద్యం రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. గోపీ గతంలో ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుకు వ్యక్తిగత ఫొటోగ్రాఫర్‌గా పనిచేసేవాడు. గత ఏడాది గరికపాడు చెక్‌పోస్ట్ వద్ద తెలంగాణ మద్యంతో పట్టుబడ్డాడు. ఉదయభానుపై విమర్శలు రావటంతో గోపీని ఆయన దూరంగా ఉంచాడు. ఫొటోగ్రాఫర్‌గా పని చేయకున్నా బలుసుపాడులో వైసీపీ కార్యకలాపాల్లో చురుకుగా ఉంటున్నాడు. బుధవారం ఉదయమే మద్యం పట్టుకున్నా దీనిని బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

మతం ముసుగులో మోసం

- రూ.ఆరు లక్షలకు శఠగోపం
- వైరా మండలం తాటిపూడిలో ఘటన

వైరా, ఫిబ్రవరి 15: ముందు మతం పేరిట ఆకర్షించారు..ఆతర్వాత తమను నమ్మిన పేదలు, అమాయకులకు ఆర్థిక లబ్ధి చేకూర్చుతామని నమ్మించారు. దాన్ని అవకాశంగా భావించి తమను నమ్మిన వారిని నట్టేట ముంచారు. రూ.ఆరులక్షల వరకు శఠగోపం పెట్టిన మాయగాళ్ల ఉదంతమిది. వైరా మండలంలో తాటిపూడి గ్రామంలో ఈ మోసం జరిగింది. ఈ మోసానికి సంబంధించి ఆ గ్రామ తాజా, మాజీ సర్పంచ్ బట్టా పెద్దభద్రయ్య ఆధ్వర్యంలో పలువురు బాధితులు వైరా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్టీఆర్ జిల్లా గంపల గూడెం మండలంలోని ఊటుకూరుకు చెందిన ఒక పురుషుడు, ఇద్దరు మహిళలు రెండునెలల కిందట తాటిపూడికి వచ్చారు. ఒక రైతు ఇంటివద్ద స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. పేదలు, అమాయకులను సమీకరించుకుని వారిని ప్రలోభాలకు గురిచేశారు. తమ దగ్గరకు వచ్చిన వారికి మొదట కొద్దిమొత్తంలో నగదు ఇతరత్రా బహుమానాలు ఇచ్చారు. విందు, వినోదాలు ఏర్పాటు చేశారు. ఇక ఆతర్వాత ఆముగ్గురు తమ మోసానికి తెర దీశారు. ప్రార్థన చేసిన వారిని పేదలు, అమాయకులు నమ్మి, వారి ప్రలోభాలకు లోనయ్యారు. వారి చేతిలో నష్టపోయిన వారు 200మందికిపైగానే ఉన్నారు. బాధితులంతా వితంతువులు, దివ్యాంగులు. ఈముగ్గురు మోసకారులు వితంతువులు, దివ్యాంగులపైనే దృష్టి సారించారు. రూ.500, రూ.3వేలు, రూ.5వేలు, రూ.10వేలు, రూ.30వేల చొప్పున వసూలు చేశారు. రూ.500 చెల్లించిన వారికి రూ.వెయ్యి, రూ.3వేలు చెల్లించిన వారికి రూ.4నుంచి 5వేలు, రూ.10వేలు చెల్లించిన వారికి రూ.50వేలు, రూ.30వేలు చెల్లించిన వారికి రూ.రెండులక్షల చొప్పున పింఛన్ ఇస్తామని, వాహనాలు సమకూర్చుతామని నమ్మించారు. దాంతో అత్యాశకుపోయిన పేదల్లో ఎక్కువ మంది రూ.500చొప్పున, మరికొంతమంది రూ.3వేల చొప్పున, కొద్దిమంది రూ.10వేలు, రూ.30వేల చొప్పున రూ.ఆరులక్షల వరకు వారికి సమర్పించుకున్నారు. వాటిని తీసుకున్న తర్వాత ఒక్కొక్కరుగా తట్టాబుట్టా సర్దుకొని తాటిపూడి నుంచి పలాయనం చిత్తగించారు.

బూడిద కాలుష్యంపై ఉద్యమిద్దాం


గేట్ల ముందు వంటా వార్పు చేద్దాం ● ఎన్టీటీపీఎస్ కాలుష్య నియంత్రణ పోరాట సమితి సమావేశంలో వక్తలు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 15: ఎన్టీటీపీఎస్, ఏపీ జెన్‌కో అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా వెలువడుతున్న కాలుష్యం ప్రజారోగ్యంపై దాడి లాంటిదని కాలుష్యాన్ని నియంత్రించే వరకు ఉద్యమిద్దామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ పోరాటసమితి ఆధ్వర్యంలో గురువారం ఎన్టీటీపీఎస్ రోడ్డులో విద్యార్థులతో భారీ మానవహారం, ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ముత్తవరపు కల్యాణ మండపంలో ఎన్టీటీపీఎస్ కాలుష్య నియంత్రణ పోరాట సమితి సమావేశం నిర్వహించారు. భారీ సంఖ్యలో మేధావులు, యువత, ప్రజలు, న్యాయవాదులు, వైద్యులు, రైతులు సమావేశానికి తరలివచ్చారు. సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. కాలం చెల్లిన వీటీపీఎస్ పాత చిమ్నీల నుంచి భారీగా బూడిద వెలువడుతోందని, యాష్ పాండ్ నుంచి బూడిద రవాణా చేయడంలోనూ నియమ నిబంధనలు పాటించకపోవడంతో బూడిద రోడ్లపై కారుతోందని వారు పేర్కొన్నారు. కోల్ వినియోగం అనంతరం వచ్చే బూడిదలో పాదరసం, సీసం, సల్ఫర్, యురేనియం వంటి ప్రమాదకర కేన్సర్ కారక కాలుష్య పదార్థాలు వెలువడుతున్నాయన్నారు. వీటీపీఎస్ ఏర్పడిన 30 ఏళ్లలో కేవలం మూడంటే మూడు మెడికల్ క్యాంప్‌లకు యాజమాన్యం ఖర్చు చేసింది కేవలం రూ.3.30 లక్షలన్నారు. 1973 ఒకసారి, 2009లో మరోసారి మాత్రమే పబ్లిక్ హియరింగ్ నిర్వహించారన్నారు. తర్వాత ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు 200 మంది వస్తే రెండు మూడు రెట్లు పోలీసులు ఉంటున్నారని పోలీసులతో ఉద్యమాలను అణచివేయలేరని హెచ్చరించారు.

రూ.18 కోట్ల సీఎస్ఆర్ నిధులు విడుదల చేయాలి

కొండపల్లి మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం మండలంతో పాటు కాలుష్య ప్రభావిత ప్రాంతాలైన 10 గ్రామాలకు రూ.18 కోట్ల సీఎస్ఆర్ ఫండ్స్ తక్షణం విడుదల చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఎన్టీటీపీఎస్ చుట్టుపక్కల ప్రాంతాల వారు పవర్ బిల్లు కట్టాల్సిన అవసరం లేదని 2008లో జీవో వచ్చినా పవర్ బిల్లులు కట్టించు కుంటున్నారన్నారు. మొక్కలు నాటి గ్రీనరీ ఏర్పాటు చేయడంలో యాజమాన్యం పూర్తిగా వైఫల్యం చెందిదన్నారు. కాలుష్యం నియంత్రించేంత వరకు పోరాటం ఆపబోమన్నారు. అవసరమైతే రెండు గేట్ల ఎదుటే వంటావార్పు ఏర్పాటు చేసుకుని ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.


ప్రజల ఉసురు పోసుకుంటున్నారు



15 ఏళ్లుగా ఎన్టీటీపీఎస్ కాలుష్యంపై పోరాటం చేస్తున్నా. కాలుష్యం కాటుకు మత్స్యకారుల జీవనోపాధి కోల్పోవాల్సి వచ్చింది. వారి పొట్ట కొట్టారు. ప్రజల ఉసురు పోసుకుంటున్నారు. కాలుష్యం నివారణకు గ్రీనరీ ఏర్పాటు చేయాలి. గ్రీనరీ ఏర్పాటు చేసేందుకు ఎన్టీటీపీఎస్ చుట్టూ ఉన్న 200 ఎకరాల భూమి స్వచ్ఛందంగా ఇచ్చేందుకు రైతులు ముందుకు వస్తారు. సరైన ధర ఇస్తే రైతుల్ని నేను ఒప్పిస్తా. భావి తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు కాలుష్యంపై పోరాటం చేద్దాం.

-జాస్తి గోపాలకృష్ణ, రిటైర్డ్ రైల్వే ఉద్యోగి, గుంటుపల్లి

నాయకులే కాంట్రాక్టర్లు.. అందుకే ప్రజలకు ఈ దుస్థితి



నాయకులే కాంట్రాక్టర్లు, కాంట్రా క్టర్లే నాయకులు. అందుకే ఈప్రాంత ప్రజలకు ఈ దుస్థితి. కాలుష్యంపై పోరాటం చేసేందుకు విజయవాడలో ధర్నా చౌక్ ఉన్నట్లే ఇబ్రహీంపట్నంలోనూ ఒక ధర్నా చౌక్ ఉండాలి. ఏ, బీ, సీ కాలనీల్లో వారి నివాస ప్రాంతాల్లో మొక్కలు నాటుకుని చుట్టు పక్కల ప్రాంతాల్లో మొక్కలు నాటినట్లు యాజమాన్యం చూపించుకుంటోంది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. నాణ్య మైన బొగ్గు సరఫరా చేయాలి. యాష్‌పాండ్‌లో స్ప్రింక్లర్లు పెట్టాలి.

-సురేష్‌బాబు, ఇబ్రహీంపట్నం

ఎన్టీటీపీఎస్‌ను ముట్టడిస్తాం



2018 నుంచి కాలుష్యంపై పోరాడుతున్నా. ముగ్గురు సీఈలకు కాలుష్యం నివారించాలని వినతి పత్రాలు ఇచ్చాం. ఫలితం లేదు. తినే తిండి, తాగే నీరు, పీల్చే గాలి అన్ని బూడిద మయం. ఢిల్లీకి రెండింతలు కాలుష్యం ఎన్టీటీపీఎస్ పరిసరాల్లో ఆవరించి ఉంది. రూ.కోటితో రోడ్ల క్లీనింగ్ మిషన్ ఇస్తామని యాజమాన్యం ఇచ్చిన హామీ నెరవేరలేదు. ఎన్టీటీపీఎస్‌ను ముట్టడి చేస్తాం. కాలనీల్లో చెట్ల మధ్య ఉండటం కాదు. పెళ్లాం, పిల్లలతో అధికారులు బయటకు వచ్చి చూస్తే కాలుష్యం ఎంత ఉందో తెలుస్తుంది.

- పోలిశెట్టి తేజ, జనసేన నాయకుడు, ఇబ్రహీంపట్నం

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	143, 152, 163
చికెన్ విత్ స్కిన్	274
చికెన్ స్కిన్‌లెస్	284

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.39

జోనల్ చైర్మన్ మహేష్ గన్నవరం డిపో పరిశీలన



గన్నవరం, ఫిబ్రవరి 15 : గన్నవరం ఆర్టీసీ డిపోను విజయవాడ జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్ గురువారం సందర్శించారు. ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు. ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అప్కాస్‌లోకి తీసుకుంటామన్నారు. దళారి కాంట్రాక్టర్లను తీసేసి ఎక్కువ జీతం వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలన్నారు. గ్యారేజీలో మొక్కలు నాటారు. జిల్లా డీపీటీవో ఎ.వాణిశ్రీ, డిపో మేనేజర్ పి.శివాజీ, సూపర్‌వైజర్లు మధు రజనీకాంత్, యూనియన్ నాయకులు నాగిరెడ్డి, కోటేశ్వరరావు, సంజీవరావు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన



ఉయ్యూరు ఆర్టీసీ డిపో గేటు ఎదుట కార్మికుల నిరసన

ఉద్యోగులను నట్టేట ముంచిన ప్రభుత్వం

కంకిపాడు, ఫిబ్రవరి 15 : అధికారంలోకి వచ్చిన వైసీపీ ఉద్యోగులను నట్టేట ముంచిందని కంకిపాడు తాలూకా ఎన్జీవోస్ అధ్యక్షుడు ఉండి వెంకట పురుషోత్తమ రాజు ఆరోపించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యచరణ పిలుపు మేరకు గురువారం కంకిపాడు తహసల్దార్ కార్యాలయం వద్ద మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉండి పురుషోత్తమ రాజు మాట్లాడుతూ బకాయిలు తక్షణం విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కరించేంత వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు పీకా ఇమ్మానుయేలు, మండవ శ్రీనివాసు, జోగి రాజు, షరీఫ్, గోపాల, ఎ.వి. రావు, సురేష్ పాల్గొన్నారు.

ఉయ్యూరు : ఉద్యోగుల జీపీఎఫ్ నిధులు వాడుకోవడంతో పాటు డీఏల బకాయిల చెల్లింపుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంచేస్తుందని ఏపీజేఏసీ ఉయ్యూరు తాలూక యూనిట్ అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఉయ్యూరు తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో గేటుఎదుట మధ్యాహ్న భోజనవిరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించి, డిమాండ్లు నెరవేర్చాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, పోతురాజు, సీహెచ్ శ్రీదేవి, నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ ఉయ్యూరు డిపో కార్యదర్శి పి.మురళీకృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రాంబాబు, డి.కోటేశ్వరరావు, డిపో కమిటీ వైస్ ఛైర్మన్ సీహెచ్ పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈడ్పుగంటిపై దాడి యత్నం దోషులను అరెస్టు చేయాలి



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న దొంతు చిన్నా తదితరులు

ఉంగుటూరు, ఫిబ్రవరి 15 : ఉంగుటూరు గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు ఈడ్పుగంటి కృష్ణమూర్తి ఇంటిపై దాడికి ప్రయత్నించిన గుర్తు తెలియని దుం డగులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ మండల టీడీపీ ఆధ్వర్యంలో నాయకులు గురువారం ఉంగుటూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ ఆగడాలు నశించాలని, కృష్ణమూర్తి ఇంటిపై దాడికి యత్నించిన దుండగులను తక్షణమే అరెస్ట్‌చేయాలని, గన్నవరంలో పిల్లసైకో పోవాలి, సైకిల్ రావాలంటూ నినాదాలు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా మాట్లాడుతూ ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసి, బెదిరింపులకు పాల్పడటం ద్వారా రాజకీయ లబ్ది పొందేందుకు కుతంత్రాలు పన్నుతున్నారని విమర్శించారు. బాధితులకు అండగా నిలిచి, రక్షణ కల్పించవలసిన పోలీసులే అధికార పార్టీనేతలకు దాసోహమయ్యారని ఆరోపించారు. పార్టీ నాయకులు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, ఆళ్ల హనోక్, మూల్పూరి సాయికళ్యాణి, ఈడ్పుగంటి కృష్ణమూర్తి, దండు సుబ్రహ్మణ్యరాజు, మేడేపల్లి రమాదేవి, కాసన్నేని రాజా, మండవ రమ్యకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ డీఎస్పీ పోలింగ్ కేంద్రాల పరిశీలన



హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 15 : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు సీఐ ఎ.ఎన్. నరసింహమూర్తి తెలిపారు. హనుమాన్ జంక్షన్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో శిక్షణ పొందుతున్న ట్రైనీ డీఎస్పీ శ్రీవేదతో కలిసి సీఐ బాపులపాడు మండలంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం సందర్శించారు. బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మౌలిక వసతులు, పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్ల సంఖ్య వివరాలను ట్రైనీ డీఎస్పీ శ్రీవేద అడిగి తెలుసుకున్నారు. జంక్షన్ ఎస్సైలు జనార్దన్, అర్జమ్మ, ఏఎస్సై పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏజీ అండ్ ఎస్‌జీ కళాశాల వాకర్స్‌తో మాట్లాడుతున్న బోడె ప్రసాద్



అంబేద్కర్ కాలనీలో పర్యటిస్తున్న బోడె ప్రసాద్



బాబు ష్యూరిటీ కార్యక్రమంలో దేవినేని గౌతమ్, స్మిత

రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును గెలిపించాలి

ఉయ్యూరు, ఫిబ్రవరి 15 : రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే టీడీపీని అధికారంలోకి తీసుకురావాలని పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బోడె ప్రసాద్ అన్నారు. ఏజీఅండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్‌ను గురువారం కలిసి తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో ఉయ్యూరులో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించి ఆలోచించి ఓటు వేయాలన్నారు. అనుమోలు ప్రభాకర్, మండవ జయదేవ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పూర్ణచంద్రరావు, సీతారామయ్య, వరప్రసాద్ పాల్గొన్నారు.

వంశీకి ఓటమి భయం : చిన్నా

గన్నవరం : ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఓటమి భయం పట్టుకుని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా అన్నారు. టీడీపీ కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ తన ఇంటి పైకి సుపారీ గ్యాంగ్‌ని పంపి తనను చంపడానికి వంశీ చూశాడన్నారు. కాసర్నేని రంగబాబు, జాస్తి వెంకటేశ్వరరావు, ఇతర టీడీపీ నాయకులపైన, ఆస్తులపైన దాడులు చేయించారన్నారు. డ్రైనేజీ గొడవలను తీసుకువెళ్లి రేప్ కేసులు పెట్టించటం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే వంశీ గ్రోత్ పడిపోయిందన్నారు. ఉంగుటూరు, బాపులపాడు మండలాల అధ్యక్షులు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, దయాల రాజేశ్వరరావు, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మేడేపల్లి రమా, మండవ రమ్యకృష్ణ, కొసరాజు సాయి, కాసన్నేని రాజా, సుకన్య, యనమదల సతీష్, సురేష్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ప్రజలపై పెనుభారం

ఉయ్యూరు : సామాన్య, మధ్యతరగతి ప్రజలపై వైసీపీ ప్రభుత్వం పెనుభారం మోపిందని టీడీపీ నేతలు దేవినేని గౌతమ్, స్మిత అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉయ్యూరు 19వ వార్డులో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. పొగిరి రాము, సలీమ్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు జగన్ తూట్లు

పెనమలూరు : అంబేడ్కర్ ఆశయాలకు సైకో జగన్ తూట్లు పొడిచాడని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ధ్వజమెత్తారు. అంబేడ్కర్ నగర్, పీర్ల పంజా వద్ద గురువారం బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీలో ఆయన పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి టీడీపీ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, సంగెపు రంగారావు, దండమూడి చౌదరి, తోటకూర ఉదయభాస్కర్, కిలారు శ్రీనివాస్, షేక్ శ్రీను, కిలారు నవీన్, కిలారు ప్రసాద్, మోత్రపు దుర్గారావు, తురక విజయ్, పరిశె వెంకటస్వామి, షేక్ సైదులు, మరీదు శంకర్, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు. యనమలకుదురు 15వ డివిజన్, శివపార్వతినగర్‌లో అధ్యక్షుడు వీరంకి కుటుంబరావు, శొంఠి శివరాంప్రసాద్, మొక్కపాటి శ్రీనివాస్, పండల రజిని పాల్గొని వచ్చే ఎన్నికల్లో బోడె ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు.

టీడీపీ జెండా ఎగరేద్దాం : జాస్తి

గన్నవరం : రానున్న ఎన్నికల్లో టీడీపీ జెండా మరో సారి ఎగురవేసేందుకు అందరు సిద్ధంగా ఉండాలని పట్టణ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ అన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జిలు, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. జాస్తి శ్రీధర్ మాట్లాడుతూ బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ, ఓట్ల వెరిఫికేషన్ విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల్లో యార్లగడ్డ వెంకట్రావు ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలవటం ఖాయమన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలన్నారు. తంగిరాల శ్రీనివాసరావు, సులోచన రాణి, దమయంతి, అన్నే జ్యోతి, సరితాదేవి, రాజేశ్వరీ, కొమ్మసాని శివాజీ, చలసాని వెంకట సత్యన్నారాయణ, సత్యన్నారాయణ, బుస్సే నాగ ప్రసాద్, ఆరిఫ్‌ఖాన్, మురళీ, నరేష్, మోజెష్, సమీర్, కోటేశ్వరరావు, ఆకాష్ పాల్గొన్నారు.

మైక్రో కంట్రోలర్ ఉపయోగాలపై వర్క్‌షాప్



ఉంగుటూరు, ఫిబ్రవరి 15 : మైక్రో కంట్రోలర్ ఉపయోగాలు, డిజైన్స్, ప్రోగ్రామింగ్‌పై ఇంజనీరింగ్ విద్యార్థులు అవగాహన కలిగి వుండాలని తేలప్రోలు ఉషా రామా ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం అన్నారు. విజయవాడ ఎస్‌ఆర్‌సీ ఇ-సొల్యూషన్స్, డిజైన్స్ ఆర్‌అండ్‌డీ ఇంజనీర్ సి.సుధాకర్‌రెడ్డి, బృందం ఆధ్వర్యంలో కళాశాలలో ఈసీఈ విభాగం రెండో సంవత్సరం విద్యార్థులకు ఎస్‌టీఎం-32బిట్ మైక్రో కంట్రోలర్ ఉపయోగాలపై మూడురోజుల వర్క్‌షాప్ గురువారం ప్రారంభించారు. మొదటిరోజు ఆర్డినో కంట్రోలర్ విశిష్టత, దానికి అనుసంధానమైన ప్రాజెక్ట్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ఈసీఈ విభాగాధిపతి, కళాశాల డీన్ ఆఫ్ ఎకడమిక్స్ సీహెచ్ శాంతిరాణి, డీన్‌ఆఫ్ ఆర్‌అండ్‌డీ జీ సాగర్, ప్రిన్సిపాల్ ప్రసాద్, వర్క్‌షాప్ కోఆర్డినేటర్స్ పి.సురేష్ పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు, ఫిబ్రవరి 15 : తీసుకొన్న అప్పు తీర్చలేదని మానసికంగా వేధిస్తూ, పదిమంది యువకులతో వచ్చి మహిళపై దాడి చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాలు... కానూరు చలసాని నగర్‌కు చెందిన తెడ్లాపు దుర్గాభవాని అదే ప్రాంతానికి చెందిన గరాగ శ్రీనివాసరావు వద్ద రూ.మూడు లక్షలు అప్పుగా తీసుకొంది. అప్పు తీర్చడం ఆలస్యమవడంతో శ్రీనివాసరావు రాత్రిళ్లు ఫోన్ చేసి తనతో శారీరకంగా కలవమంటున్నాడని, బూతులు తిడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 11న తన ఇంటికి పది మంది యువకులతో వచ్చి సోఫాలో కూర్చున్న తనను దుర్భాషలాడాడని, తనపై దాడి చేశారన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గోల్డు బాండ్స్ విక్రయం

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 15 : అధిక లాభాలు అందించే సావరిన్ గోల్డు బాండ్స్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్‌లో అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి ఉన్న వారు కొనుగోలు చేసుకోవచ్చని మేనేజర్ బి.నరేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి గోల్డు బాండ్స్ విక్రయిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారంతో విక్రయాలు ముగుస్తాయన్నారు. పరిమితి లేదని ఎన్నిగ్రాములైన కొనుగోలు చేసుకోవచ్చని మేనేజర్ తెలిపారు.

గంజాయి ముద్దాయిలకు రిమాండ్

పెనమలూరు, ఫిబ్రవరి 15 : కొన్ని నెలలుగా గంజాయి కేసుల్లో ముద్దాయిలుగా ఉంటూ తప్పించుకు తిరుగుతున్న ఆరుగురు యువకులను పెనమలూరు పోలీసులు అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరచగా వారికి కోర్టు రిమాండ్ విధించిందని సీఐ టీవీవీ రామారావు తెలిపారు.



అగ్నిబాధితులకు సాయం

ఉయ్యూరు : అగ్నిప్రమాద బాధితులకు సాయం మందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని రక్ష ఫౌండేషన్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. ఇటీవల నాగన్నగూడెం, కాటూరులో జరిగిన అగ్నిప్రమాదాల్లో ఇళ్ల కాలిపోయి కట్టుబట్టలతో మిగిలిన మూడు కుటుంబాలకు బియ్యం, దుస్తులు, వస్తువులు గురువారం అందజేశారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ హబీబ్ బాషా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఉయ్యూరు, ఫిబ్రవరి 15 : నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపేవారిపై చర్యలు తప్పవని ఉయ్యూరు సీఐ ఎండీ హబీబ్ బాషా హెచ్చరించారు. పట్టణ ఎస్సై గణేశ్, సిబ్బందితో కలసి గురువారం ప్రధానసెంటర్‌లో వాహనాలు తనిఖీచేశారు. లైసెన్స్ నంబరుప్లేటు లేకుండా బైక్‌లు నడిపేవారితో పాటు మైనర్లను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా విధించారు. బాలుర తలితండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.



నోట్‌బుక్స్ పంపిణీచేస్తున్న హెచ్‌ఎం, సర్పంచ్

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

ఉంగుటూరు, ఫిబ్రవరి 15 : విద్యార్థులు చదువుతోపాటు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు అన్నారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నారయ్య అప్పారావుపేటలోవారం రోజులుగా నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంప్ గురువారం ముగిసింది. గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో సర్పంచ్ ఎస్.నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీహరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో కూడిన విద్యనభ్యసిస్తే భవిష్యత్తులో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు.అనంతరం 52మంది విద్యార్థులకు స్టేషనరీ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జె.దుర్గ, కేవీ.నాగబాబు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దాతలు

దివ్యాంగుల పాఠశాలలకు నిత్యావసర సరుకుల పంపిణీ

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 15 : ఆశాజ్యోతి దివ్యాంగుల పాఠశాల, ఆదిత్య బధిర విద్యాలయానికి మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు బాణాల నరసింహారావు సత్యవతి దంపతులు తల్లిదండ్రులు జ్ఞాపకార్థం ఒక్కొక్క పాఠశాలకు 25 కిలోలు చొప్పున బియ్యం నిత్యావసర సరుకులు గురువారం అందజేశారు. నరసింహారావు దంపతులు ఏలూరు రోడ్డులోని కోదండరామాలయంలోని రాముడి విగ్రహానికి కిరీటం ఏర్పాటు చేసేందుకు రూ.8వేలు విరాళం అందజేశారు. దాతలను మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అభినందించారు. సంస్థ నిర్వాహకులు కూరెళ్ల సుబాచారి, కళ్లేపల్లి నారాయణరావు, జేవీవీ. సత్యనారాయణ, వేగిరెడి సూర్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు, కొట్నాని రామచంద్రరావు, చెక్కాసుబ్బారావు, పీవీ చలం తదితరులు పాల్గొన్నారు.

వీరవల్లిలో మెగా వైద్యశిబిరం రేపు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 15 : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ వైద్యసేవలందించేందుకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని మమతల పందిరి వ్యవస్థాపకుడు లంక రమేష్ తెలిపారు. వీరవల్లిలోని పీఏసీఎస్ ఆవరణలో అను హాస్పిటల్స్ సహకారంతో శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులకు గుండె, నరములు, తదితర సమస్యలపై అత్యాధునిక వైద్య పరీక్షలు(2డి, ఎకో) నిర్వహించడం జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరానికి వచ్చేవారు పాత వైద్యపరీక్షల రిపోర్టులను కూడా తీసుకురావాలని సూచించారు.



విలేకరులతో మాట్లాడుతున్న హరిబాబు

రైతులను మోసం చేసిన కేంద్రం

గన్నవరం, ఫిబ్రవరి 15 : గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు పిలుపు నిచ్చారు. గన్నవరంలో గురువారం ఆయన విలేకరులతో గురువారం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. హామీల అమలు కోసం ఢిల్లీ వెళుతుంటే శత్రు దేశం మీద దాడికి వెళుతున్నట్లుగా పోలీసులు, ఇతర సైన్యాన్ని ప్రయోగించటం దారుణమన్నారు. స్వామినాథన్‌పై ఎంతో ప్రేమ ఉన్నట్లు భారతరత్న ఇచ్చారని, మరోవైపు స్వామినాథన్ ఇచ్చిన సిఫారసులు అమలు చేయకుండా ఆటకెక్కించారన్నారు. జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు మాట్లాడుతూ కార్మిక చట్టాలు నాలుగు కోడ్‌లుగా మార్చి ఫ్యాక్టరీ యజమానులకు ఉపయోగపడే విధంగా కార్మికులకు నష్టం చేసేట్టుగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. రైతు సంఘం నాయకులు సూరగాని సాంబశివరావు, మల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో మహిళ మృతదేహం

కలువపాముల(ఉయ్యూరు), ఫిబ్రవరి 15 : కలువపాముల దూబ ఎస్సీకాలనీ సమీపంలోని దోసపాడు చానల్‌లో గురువారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఉయ్యూరు రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల లోపు ఉంటుందని పోలీసులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్ 143, 152, 163
చికెన్ విత్ స్కిన్ 274
చికెన్ స్కిన్‌లెస్ 284

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.39



ట్రక్కు ఆటో ఢీకొని వృద్ధుడు మృతి

పామర్రు, ఫిబ్రవరి 15 : పామర్రు - చల్లపల్లి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. స్థానిక అరండల్‌పేటకు చెందిన పామర్తి నాంచారయ్య (65) బుధవారం రాత్రి 12 గంటల సమయంలో సెంటర్లో పనిముగించుకుని రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న సమయంలో కూచిపూడి వెళ్తున్న ట్రక్కు ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన నాంచారయ్యను పోలీసులు 108లో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పి.ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.



పెడనలో ఉపాధ్యాయుల నిరసన

పెడన : ఏపీ జేఏసీ పిలుపు మేరకు భట్ల జ్ఞానకోటయ్య పాఠశాల ఉపాధ్యాయులు గురువారం విరామ సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉపాధ్యాయ సంఘం నేత పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామన్నారు. హెచ్‌ఎం విజయ లక్ష్మి, ఉపాధ్యాయులు కె.ఎ.ఉమామహేశ్వరరావు, అబ్రహం, శ్రీనివాస్, రాంబాబు, ప్రసాద్, హరిత, అరుణ, దేవి, పద్మజ, శమంతకమణి, పరిమళ, ధనలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.



ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం

చల్లపల్లి : ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ 27వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పాగోలు ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణ కుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, ఏఎంసీ ఛైర్మన్ మండవ బాలవర్ధిరావు, నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, షేక్ నబీషోరి, నిడమానూరి దిలీప్‌కుమార్, నాదెళ్ల వెంకట నరసయ్య, మేకా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్‌చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌ను అత్యంత సమర్థవంతంగా నడిపిస్తున్న మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికి అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ జి.మధుసూధనరావు, వైస్ ప్రిన్సిపాల్ డి.అప్పలనాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా భావనారుషి స్వామి సంబరం

పెడన : పద్మశాలీయుల ఇలవేల్పు భావనారుషి స్వామి సంబరం గురువారం వైభవంగా జరిగింది. నందం దుర్గావెంకట కోటేశ్వరరావు, శివపార్వతి దంపతులచే యాజ్ఞిక బ్రహ్మ ఐలూరి జయకిషోర్ పూజలు జరిపించారు. మేళతాళాలు, బాణాసంచా కాల్పులు, వీరంగ, నారసాల విన్యాసాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనుముల పూర్ణచంద్రరావు, నందం చినబాబు, చిలుకోటి గోవిందు, అనుముల పెద పూర్ణచంద్రరావు, ఆకురాతి జనార్ధన్, నందం శ్రీనివాసరావు, బొడ్డు గోపీ, నందం నాని, పడవల నారాయణ, జక్కా శ్రీను, దివి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్, పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి కాగిత కృష్ణప్రసాద్ భావనారుషి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



కర్రగ్రహారంలో మాట్లాడుతున్న కొల్లు నీలిమ



మామిడికోళ్లలో మహిళలతో మాట్లాడుతున్న వెనిగండ్ల, రావి



వింజరంపాడులో కుమార్‌రాజా సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు

చంద్రబాబుతోనే అన్ని వర్గాలకు మేలు

● బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో కొల్లు నీలిమ, వెనిగండ్ల రాము

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 15 : చంద్రబాబు పాలనలోనే అన్ని వర్గాలకు మేలు కలుగుతుందని, మహిళలకు రక్షణ లభిస్తుందని కొల్లు నీలిమ అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి కొల్లు నీలిమ తాళ్లపాలెం, గిరిపురం, కర్రగ్రహారం, పల్లెపాలెం తదితర గ్రామాల్లో ఇంటింటికీ పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కొల్లు నీలిమ మాట్లాడారు. టీడీపీ, జనసేన అధికారంలోకి రాగానే బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తారన్నారు. గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్నారు. పల్లె తాళ్లపాలెం వంతెన నిర్మాణ పనులు, అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు చేయాలని ప్రజలు కోరారు. తలారి సోమశేఖర్, లంకే శేషగిరి, లంకే నారాయణ ప్రసాద్, మోకా రాజు, కొక్కిలిగడ్డ నాగరమేష్, బొడ్డు శ్రీను, కొనకళ్ల నాగరాజు, బడుగు నాగమల్లేశ్వరరావు, కొక్కిలిగడ్డ జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** మామిడికోళ్ల, లంకదొడ్డి గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిషత్ గ్యారెంటీ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము పాల్గొన్నారు. చంద్రబాబు పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, వల్లభనేని బాబూరావు, అడుసుమిల్లి రామ్మోహనరావు, కొడాలి రామరాజు, తోట మల్లి , రాధిక , సాగర్‌బాబు, జనసేన నాయకులు పేర్ని జగన్, బుల్లా కింగ్, మాదాసు శ్రీను పాల్గొన్నారు. **పెదపారుపూడి :** రాష్ట్రంలో దోపిడీకి కేరాఫ్ అడ్రస్ వైసీపీఅని వర్ల కుమార్ రాజా అన్నారు. వింజరంపాడు, అప్పికట్ల, జువ్వనపూడి, ఈదులమద్దాలి, చినపారుపూడి తదితర గ్రామాల్లో గురువారం పల్లెబాట నిర్వహించారు.అప్పికట్ల దళితవాడలో పల్లె నిద్ర చేసిన అనంతరం మహిళలు గ్రామస్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వింజరంపాడులో 200 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. కుమార్ రాజా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ఉపాధ్యక్షుడు సూరపనేని వెంకట సత్యనారాయణ, కార్యదర్శి మసిముక్కు రాంబాబు,గొరిపర్తి రవికుమార్, దానబోయిన వెంకట నారాయణ, చప్పిడి కిషోర్, చప్పిడి సమీరా, కూచిపూడి సుబ్బయ్య, బుడ్డాలు, జమ్మిబాబు, గోగం రామారావు, గుండపనేని శ్రీనివాసరావు, సజ్జా శివకుమార్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు అనుకూల పవనాలు



మచిలీపట్నం టౌన్ : ప్రజల్లో మార్పు వస్తోందని, చంద్రబాబు పాలన కోసం ఎదురు చూస్తున్నారని చంద్రబాబుకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న టీడీపీ కార్యకర్త పత్తిపాటి నాగ బాలాజీ పేర్కొన్నారు. మచిలీపట్నం వచ్చిన ఆయనను టీడీపీ కార్యాలయంలో సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, నగర టీడీపీ అధ్యక్షుడు ఎండి ఇలియాస్ బాషా, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రిబాబా ప్రసాద్ , పిప్పళ్ళ కాంతారావు సత్కరించారు. నాగబాలాజీ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు మద్దతుగా నాగార్జునసాగర్ నుంచి యాత్ర ప్రారంభించానన్నారు. తన తండ్రి భాస్కరరావును స్ఫూర్తిగా తీసుకుని టీడీపీ , జనసేనల గెలుపుకు కృషి చేస్తున్నానన్నారు.

హైదారాబాద్ రాజధాని కావాలనడం అవివేకం

మచిలీపట్నం టౌన్ : మళ్లీ హైదరాబాద్ రాజధాని కావాలని వైసీపీ నాయకులు సుబ్బారెడ్డి మీడియా సమావేశాల్లో డిమాండ్ చేయటం ఆశ్చర్యంగా ఉందని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ పరిజ్ఞానం ఉన్న వారు ఎవరూ హైదరాబాద్ రాజధానిగా ఉండాలని కోరుకోరన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ , టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా , కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు మాట్లాడారు.

బాలిక వైద్య చికిత్సకు వెనిగండ్ల ఆర్థిక సహాయం

గుడివాడ : బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్న గుడివాడ 30వ వార్డుకు చెందిన దుండుగుల హేమ అనే బాలికకు గురువారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధి ద్వారా వాటిని అందజేశారు. సకాలంలో స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించిన వెనిగండ్లకు బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నాగాయలంక : గుల్లలమోదలో బ్లేడుతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. బాపట్ల జిల్లా నిజాంపట్నానికి చెందిన మోపిదేవి వీర్రాజుకు జగన్మోహన్‌రావు అనే వ్యక్తికి మధ్య బంధువుల అమ్మాయి విషయంలో గొడవలు జరిగాయి. ఈ నెల 14వ తేదీన జగన్మోహన్ రావు గుల్లలమోదలో పని ఉందని వీర్రాజును తీసుకురాగా, ఇద్దరూ కలిసి మద్యం తాగారు. అదే రోజు రాత్రి గుల్లలమోద ఏటి ఒడ్డున పడుకున్నారు. ఈ క్రమంలో జగన్మోహనరావు పాత విషయం మనస్సులో పెట్టుకుని వీర్రాజుపై దాడి చేసి గాయపర్చాడు. వీర్రాజును 108 అంబులెన్స్‌లో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ఆసుపత్రి నుంచి వచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల అదుపులో అనుమానాస్పద వ్యక్తులు

బంటుమిల్లి : అర్తమూరులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను గ్రామస్థులు పట్టుకుని గురువారం బంటుమిల్లి పోలీసులకు అప్పగించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపాన అనుమానాస్పదంగా సంచరిస్తూ పుస్తకాలను చలి మంటగా వేసుకున్న వ్యక్తులను ప్రశ్నించగా గ్రామస్థులపై దాడి చేయబోయారు. గ్రామస్థులు వారిని పట్టుకుని ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సై జి.వాసు సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. పరసా వెంకటేష్, మరో ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నామని, వీరు మచిలీపట్నానికి చెందిన వారికి తెలిసిందని ఎస్సై జి. వాసు తెలిపారు.

శారదానగర్ తెలుగుయువత కమిటీ

మచిలీపట్నం టౌన్ : వైసీపీ అక్రమాలను తెలుగు యువత ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ సనకా నాగులు అన్నారు. శారదానగర్‌లో 12 మందితో నూతనంగా తెలుగు యువత కమిటీ ఏర్పాటు చేశారు. ప్రతిపక్ష నాయకురాలు సమతాకీర్తి, నగర తెలుగు యువత అధ్యక్షుడు సలీం, మాజీ కౌన్సిలర్ రాయపూడి చిన్ని, ప్రమీల పాల్గొన్నారు. అధ్యక్షుడిగా షేక్ బాజీ, ఉపాధ్యక్షుడిగా కాకుమాని రాజేష్, ప్రధాన కార్యదర్శి కొమ్ముకూరి వరప్రసాద్, కోశాధికారిగా గోసాల శ్రీధర్ ఎన్నికయ్యారు.



లక్ష్య స్కూల్ విద్యార్థిని దీవెన ప్రతిభ

కోడూరు : లక్ష్య స్కూల్ విద్యార్థి ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ జి.నాగరాజు తెలిపారు. విజయవాడలో నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో లక్ష్య స్కూల్ విద్యార్థిని కడవకొల్లు దీవెన రూపొందించిన అగ్నితో విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. డీఈవో తాహెరా సుల్తానా విద్యార్థిని అభినందించి సర్టిఫికెట్, విన్నర్ షీల్డ్ అందించినట్లు తెలిపారు.

అగ్ని బాధితులకు సాయం

అవనిగడ్డ రూరల్ : వసుమట్ల కాలనీలో ఇటీవల అగ్ని ప్రమాదం జరిగింది రెండు గృహాలు దగ్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో లలితా దేవి ఛారిటబుల్ ట్రస్ట్ తరఫున ట్రస్టీ ముమ్మారెడ్డి కృష్ణారావు బాధిత కుటుంబాలకు వంట సామాగ్రి, దుప్పట్లు, చీరలు, నిత్యావసర వస్తువులు, ఆర్థిక సాయమందించారు. జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గుడివాక శేషబాబు, ఎంపీటీసీ సభ్యుడు బొప్పన భాను, పులిగడ్డ గ్రామ పార్టీ అధ్యక్షుడు మండలి ఉదయ్, వార్డుసభ్యులు అడపా ప్రభాకర్, కమ్మిలి సాయి భార్గవ్, కమతం నరేష్ పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

నాగాయలంక : ఎదురుమొండి దీవుల గ్రామాల్లోని 30 మంది విద్యార్థులకు అసిస్ట్ సంస్థ సహకారంతో ఉచిత కంప్యూటర్ కోర్సు శిక్షణను గురువారం ఎదురుమొండిలో ప్రారంభించారు. అసిస్ట్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, ఏరియా కో-ఆర్డినేటర్ వెంకట్రావు, సంస్థ ప్రతినిధులు, సైబర్ జోన్ ప్రతినిధులు బీసాబత్తిన కృష్ణలీల పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

అవనిగడ్డ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి ఎర్రబర్ల వీర శ్రీనివాసరావు రూ.20 వేల విలువ చేసే పోర్టబుల్ మైక్ సెట్, ఆట వస్తువులను సీఐ త్రినాథ్ చేతులమీదుగా హెచ్‌ఎం జి.ఎన్.బి.గోపాల్‌కు అందజేశారు. సీఐ, దాత శ్రీనివాసరావును పాఠశాల విద్యాకుటుంబం ఘనంగా సత్కరించారు. పీడీలు సనకా శ్రీకాంత్, అమ్ముల భాను ప్రకాష్, కోడూరు పూర్ణచంద్రలు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

గుడివాడ : వైసీపీ నేత దుక్కిపాటి శశిభూషణ్ పుట్టినరోజు సందర్భంగా గురువారం శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో శాంతి, వృద్ధాశ్రమం, కరుణాపీఠంలలో వృద్ధులకు భోజనం పెట్టారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సభ్యులు పర్వతనేని ఆనంద్, నాయకులు సయ్యద్ గఫార్, సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్, తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో రాజధాని ఫైల్స్ చిత్ర ప్రదర్శన నిలిపివేత

చల్లపల్లి : చల్లపల్లి కోమలా థియేటర్‌లో రాజధాని ఫైల్స్ ప్రదర్శనను రెవెన్యూ అధికారులు గురువారం నిలిపివేశారు. ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వో ఆంజనేయులు థియేటర్‌కు వచ్చి హైకోర్టు ఉత్తర్వుల మేరకు సినిమా ప్రదర్శన నిలిపివేయించారు. ప్రేక్షకులు రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. సినిమా ప్రదర్శన మధ్యలోనే నిలిపి వేయించటం సరికాదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను తాము పాటిస్తున్నామని రెవెన్యూ అధికారులు వివరించారు.

నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

కూచిపూడి : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పిల్లలను చదివించాలని మొవ్వ ఎంఈవో -2 కె.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. కూచిపూడి సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్‌లో పిల్లల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.ఎస్.సాయికుమార్, గుంటూరు వెంకట సత్య ప్రసాద్, బండారు మాణిక్యాలరావు పాల్గొన్నారు.

పేదకుటుంబానికి విక్కుర్తి చేయూత

కోడూరు : ఉల్లిపాలెం సమీపాన నివశిస్తున్న షేక్ అహ్మద్‌కు కుటుంబ పోషణ ఇబ్బందికరంగా ఉంది. స్థానికుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న ప్రముఖ కాంట్రాక్టర్ విక్కుర్తి శ్రీనివాస్ గురువారం 50 కేజీల బియ్యం, రూ.3 వేల నగదును మండల టీడీపీ, జనసేన పార్టీ నాయకుల ద్వారా అందజేశారు. మర్రే గంగయ్య, పెద్ది భాస్కరరావు, బడే వీరబాబు, కాగిత రామారావు, కోట రాంబాబు, కసగాల వెంకటేశ్వరరావు, తోట సోమశేఖరరావు, బడే ఆకురాయి, నాగం బాపయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు నగదు పంపిణీ

గుడివాడ : తల్లుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కొడాలి నాని కోరారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆసుపత్రి ఆధ్వర్యంలో పేద వర్గాల గర్భిణులకు పౌష్టికాహారం నిమిత్తం ఆర్థిక సహాయాన్ని నాని అందజేశారు. 206 మంది మహిళలకు రూ. 1000 చొప్పున అందజేశారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఈవోలు ఉయ్యూరు సుధాకర్, నటరాజన్ షణ్ముగం, కె.సురేష్‌బాబు, కె.వి.గోపాలరావు, స్త్రీ,శిశు సంక్షేమ అధికారి పద్మావతి, పాల్గొన్నారు.

పేద బాలికలకు సాయం

మచిలీపట్నం టౌన్ : పేద బాలికలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని గొర్రెపాటి రేవతీభాను మెమోరియల్ ట్రస్టు అధినేత గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గోపీచంద్ తన మనుమడు పావన కృష్ణ చంద్ పుట్టిన రోజు సందర్భంగా పేద విద్యార్థులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. దామోదర్, చంద్రశేఖర్, ఫణికుమార్, రాజేంద్రప్రసాద్, అశోక్ బాబు, సుబ్రహ్మణ్యం, శర్మ తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శి టి.వి.రమణకు సత్కారం

అలీనఖీపాలెం (పమిడిముక్కల) : రాష్ట్రస్థాయిలో ఉత్తమ కార్యదర్శి అవార్డు పొంది, ఢిల్లీ గణతంత్ర దిన వేడుకల్లో పాల్గొని పురస్కారం అందుకున్న అలీనఖీపాలెం, చోరగుడి, గురజాడ గ్రామ పంచాయతీల కార్యదర్శి టీవీ రమణను గురువారం ఘనంగా సత్కరించారు. అలినఖీపాలెం గ్రామసచివాలయలో లంకపల్లి ఎంపీటీసీ సభ్యుడు మిర్జా సజ్జాద్ ఆలీ, మండల కో-ఆప్షన్ సభ్యుడు మీర్జా దియానత్ ఆలీ, మిర్జా అజ్గర్ ఆలీ ఆధ్వర్యంలో రమణను సత్కరించారు. సచివాలయం సిబ్బంది, గ్రామస్థులు పాల్గొని రమణకు అభినందనలు తెలిపారు.



కృష్ణా వర్సిటీలో సందడిగా ఫ్రెషర్స్ డే

మచిలీపట్నం టౌన్ : కృష్ణా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో ఫ్రెషర్స్ డే వేడుకలు సందడిగా జరిగాయి. రిజిష్ట్రార్ డాక్టర్ పి.వి. బ్రహ్మాచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల మధ్య స్నేహభావం పెరిగేందుకు ఫ్రెషర్స్‌డే దోహదపడుతుందన్నారు. డి. రామశేఖరరెడ్డి, పుష్పలత, రవి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

వీకేఆర్ వీఎన్‌బీ ఆధ్వర్యంలో దంత వైద్యశిబిరం

గుడివాడ : ధనియాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డి.టి.వి కృష్ణారావు ప్రారంభించిన శిబిరం వేములపల్లి దంత వైద్యశాల డాక్టర్ ఎం.మృదుల, డాక్టర్ ఐ.చైతన్యకుమార్ 130 మందికి పరీక్షలు నిర్వహించి 60 మందికి ఉచితంగా మందులను అందజేశారు. కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్‌ఎస్.హెచ్.వి ప్రసాదరావు, 30వ వార్డు కార్యదర్శి దాసరి అనూషా, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.దిలీప్, ఎంబీఏ విభాగాధిపతి నవులూరి ముత్యాలు, క్యాంప్ సమన్వయకర్తలు ఎస్.ధనుంజయ, ఎం. నరేంద్ర, కళాశాల విభాగాధిపతులు, ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.